# ఆచరణలో లేని అభ్యుదయం

* రచన. శ్రీమతి పసల శీతారత్నమాంబ. *

బస్సు దిగి కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరింది, టైపిస్టు సుగుణ, తల నొప్పిగా, అలసటగా ఉండే ఈజీ చైరులో వాలింది.

'కాఫీ తీసుకురానా, సుగుణా' రాఘవమ్మ పడుకున్న కూతుర్ని అడిగింది.

'వద్దమ్మా తల నొప్పిగా వుంది'

'మరేం కాఫీవద్దంటావు, ఇదిగో ఈ అనాసిన్ మాత్ర వేసుకో, వేడికాఫీ తీసుకువస్తాను' అంటూ ఇంట్లోకి వెళ్ళింది కాఫీతాగి బట్టలు మార్చుకుని తనగదిలోకి వెళ్ళి కళ్ళుమూసుకుని పడుకుంది, ఆ రోజున జరిగిన సంఘటన పదేపదే కళ్ళల్లో కదులుతోంది. టైపు చేసిన కాగితాలు సంతకం చేయించటానికి మేనేజర్ రూముకి వెళ్లింది సుగుణ. సంతకాలుచేస్తూ సుగుణను ఆపాదమస్తకం పరిశీలిస్తున్నాడు మేనేజర్ రమేష్. గులాబిరంగు పుల్ వాయిల్ చీర, రెడ్ కలర్ జాకెట్టు, వత్తుగా నల్లగా నిగనిగలాడే త్రాచుపాము లాంటి బారెడు జడ, చేతికి రిస్టువాచీతో అతి సాధారణంగా, నిరాడంబరంగావున్న సుగుణ అంటే రమేష్కు చెప్పలేని జాలి, సానుభూతి... ప్రేమ విషాద చూపులతో ఎదుటివారికి జాలి అనిపించేలా ఉంటుంది సుగుణ ముఖం.

'సుగుణా' మీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి.

'ఏమిటో చెప్పండి సార్' అంది మెల్లిగా సుగుణ.

'ఏ ప్రమేయము లేకుండానే నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను సుగుణా, మీకిష్టమైతే మనం వివాహం చేసుకుందాం' అని ఏమంటుందోనని సుగుణవైపు చూశాడు. సుగుణముఖం తెల్లగా పాలిపోయింది. ఈ మాటలు వస్తాయని ఎదురుచూడని సుగుణ ఒక్కసారిగా కరంటు షాక్ తిన్నట్లు 'సార్' అంది.

'సుగుణా ఆలోచించి చెప్పు తొందరేం లేదు. నేను మనస్ఫూర్తిగ ప్రేమిస్తున్నాను. నా ఊహల్లో ఉన్న సజీవ మూర్తిని నీవే ననిపిస్తుంది. నేను ఎందరో అమ్మాయిల్ని చూశాను కాని నిన్ను చూశాక నా మనసెందుకో హాయి అనిపించింది' ఏ సమాధానం రాకపోతే తలెత్తి సుగుణ వంక చూశాడు రమేశ్. సుగుణ కళ్ళ నిండిన నీళ్లు టేబుల్ పైబడి చిన్నశబ్దాన్ని చేస్తున్నాయి. రమేశ్ నిర్ఘాంత పోయాడు.

'సారీ సుగుణా మీ అభిప్రాయం తెలుసుకోకుండా ఆవేశాన ఉన్నది ఉన్నట్లు చెప్పటం, నామనస్సులోది ఇతరులతో చెప్పి బరువు తీర్చుకోవటం, నాకు చిన్నతనమునుండి అలవాటు.'

'అఁ మీరు అంటున్నది కాదు' సుగుణ తొట్రుపాటులో అంది'

'ఆలోచించుకొనే చెప్పు' సంతకంపెట్టిన పేపర్లు ఇచ్చేస్తూ అన్నాడు 'రమేష్' పేపర్లు తీసుకుని తనసీటు దగ్గరకు వచ్చింది సుగుణ. పక్కన తోటి సుజాత క్లర్కుతో గుసగుసలాడుతూ తనని చూచి పెద్దగ నవ్వటం వినిపించి ఏమీ చేయలేక నిస్సహాయంగా సీటులో కూర్చుంది సుగుణ. టైపు సరిగ చేయలేకపోతోంది. గబగబా కాగితాలన్నీ సర్ది బీరువాలో పెట్టి బస్సు ఎక్కి ఇంటికి చేరింది. తన జీవితం పూర్తిగా తెలిస్తే రమేష్ తనని అంగీకరిస్తాడా? ఎంతమాత్రము అంగీకరించడు... అతను అంగీకరించినా తను ఎలా వివాహం చేసుకుంటుంది. పాప సంగతి ఏమిటి? ఛీ ఛీ తనకు ఇంకా వివాహమా? పాపను చక్కగా పెంచి భవిష్యత్తు మూడు పువ్వులు, ఆరు కాయలు కావాలని ఎన్నో కలలు కంది, కానీ ఒక వేళ తను వివాహం చేసుకొన్నా, పాపను బిడ్డగా అంగీకరించలేడు. వద్దు, కోరి పాప జీవితాన్ని నరకం చెయ్యొద్దు. తన జీవితానికి సుఖసంతోషాలు అవసరంలేదు, తనపిచ్చిగాని, తను ఊహ వచ్చిన దగ్గర్నుంచి సుఖపడిందెప్పుడు? ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ 'అమ్మా' మాస్కూల్లో రేపు ఫంక్షను ఉందమ్మా ఇన్స్పెక్టరు గారు వస్తున్నారు మా టీచరు మంచిబట్టలు వేసుకునిరమ్మన్నారు' అంటూ మీద పడింది. ఒక్కసారిగా పాపను హృదయానికి హత్తుకుని గాఢంగా ముద్దుపెట్టుకుని కళ్ళు తుడుచుకుంది. తల్లిని చూచి అయోమయంగా తల్లి హృదయంలో తల మార్చుకుంది పాప.

ఆరోజు ఆఫీసుకెళ్తూనే బిక్కు బిక్కుమంటూ వెళ్ళింది. సుగుణ తన పని యాంత్రికంగా చేసుకుంటుంది.

'అమ్మా! మేనేజరుగారు రమ్మంటున్నారు' అంటూ ప్యూన్ వచ్చాడు. సుగుణ తన అదురుతున్న గుండెలు బిక్కబట్టుకుని మేనేజరు రూంలోకి నడిచింది.

'కూర్చో సుగుణా!' ఆప్యాయంగా అన్నాడు రమేష్, సుగుణ కూర్చోలేదు. సుగుణ వంక పరీక్షగా చూశాడు, వాడిపోయిన ముఖంతో తల వంచుకుని నిలబడింది.

'ఏమి నిర్ణయించుకున్నావు సుగుణా! మళ్ళీ ఈ రోజు అడుగుతున్నాను నా అదుర్దా అలాంటిది ఏమనుకోక

అన్నీ నేను మాట్లాడేస్తున్నాను. నీవు నోటితో మాట్లాడకపోయిన కళ్లు నవ్వుతున్నాయి'

'సుగుణ పండ్లతో పెదవి నొక్కిపెట్టి గోడమీద నున్న గాంధి, నెహ్రూ చిత్రపటాలని చూస్తుంది. సిగ్గుపడుతుందనుకున్నాడు రమేష్. కాని సుగుణ మనస్సులో దాగిన విషాదం అతనికేం తెలుసు పాపం!

రెండురోజులనుండి సుగుణ ఆఫీసుకు రాకపోయేసరికి రమేష్‌కి పిచ్చెక్కినట్లయింది. కారణం సరిగా తెలియటంలేదు. తనంటె యిష్టం లేకేమొ అయితే నాకు చెప్ప వచ్చుగా, పిచ్చిగా తలపీక్కున్నాడు. సుగుణలేని జీవితం లేనే లేదు. సుగుణతో తన జీవితం బంగారుబాటకై పయనించాలి. తనూ సుగుణ పూవు తావిలా కలిసిపోవాలని తహతహ లాడుతున్నాడు. కాని సుగుణ నిరాకరిస్తే అప్పుడు తన జీవితం సుగుణలేని జీవితం, ఊహించలేక పోతున్నాడు రమేష్ ఆలోచనలో బుర్ర వేడెక్కింది. మౌనంగా బయటకు నడిచాడు.

నీరసంగా మంచంమీద పడుకోని శూన్యంలోకి చూస్తుంది సుగుణ, రమేష్‌కు ఏంజవాబు చెప్పాలి.

'మీరు నోటితో మాట్లాడటం లేదు కాని మీకళ్లు నవ్వుతున్నాయి.

అన్న రమేష్ మాటలు పదేపదే గుర్తుకు వస్తున్నాయి. కాని తను వివాహిత, వితంతువు, మాతృమూర్తి అయిన తన మనస్సు యింకా రమేష్‌ను కోరుతుందా! ఛీ. ఛీ ఎంతోమంది యువకులను చూస్తుంది, రమేష్ రూపం తనలో చలనం కలిగించింది కాని తనకు పాతిక సంవత్సరాలు నిండని తనకు అన్నీ పూర్తి అయాయి కాదు విధి తన జీవితం మీద ఎదురుదెబ్బ తీసింది. పునర్వివాహం ఒక్క పురుషుని సొత్తే అంటుంది సంఘం, కాదు స్త్రీల సొత్తు కూడా అంటారు రాజారావు మోహన్‌రాయ్, వీరేశలింగం పంతులుగారి వంటివారు. ప్రోత్సహించినా స్త్రీకి పరిపూర్ణంగ పునర్వివాహానికి ఒప్పుకోలేదు పోతోంది. పిల్లలున్న స్త్రీల సంగతి మరీ ఘోరం. పిల్లలున్న పురుషులు ద్వితీయవివాహాలు చేసుకున్న ఆ పిల్లలను చేరదీసి మాతృత్వాన్ని ప్రసాదిస్తుంది స్త్రీ, కాని పిల్లలున్న స్త్రీని చేసుకుని పితృత్వాన్ని ప్రసాదించలేరు, ఇదే స్త్రీ పురుషులకున్న పెద్ద తేడా!

ఇలా ఉంది మన సమాజం. అలాంటప్పుడు రమేష్‌ను వివాహం చేసుకోవటం కోరి నరకం తెచ్చుకోవటమే అవుతుంది. దీర్ఘంగా నిట్టూర్చి కళ్లు మూసుకుంది సుగుణ. అడుగులు చప్పుడు విని కళ్లెత్తిచూసి 'మీరా రండి' తడబడుతూ అంది సుగుణ.

'లేవకు పడుకో' సుగుణ కంట్లో ఏలాగులా, [illegible] పట్టుకుంటూ అడిగాడు రమేశ్. సుగుణ ఆపాదమస్తకం వణికింది, అతని చేతిలో ఆనచేయి ఆ స్పర్శ తనకు ఎక్కడికో తీసుకు వెళ్తుంది 'సుగుణా నిన్ను చూడక రెండు రోజులు పిచ్చి వాణ్ణయి పోయాను' ఇంకా ఏవో చెప్పేలోగా పాప అక్కడకు వచ్చింది.

'అమ్మా! ఈరోజే స్కూల్లో సర్కస్ ఉందిటపావలా ఇవ్వవూ' అంటూ వచ్చిన పాప క్రొత్త వ్యక్తిని చూసి ఆగిపోయింది. బొద్దుగా పచ్చగ, ముద్దుగ ఉన్న పాప వైపుచూస్తూ, సుగుణా ఎవరీ పాప? అన్నాడు.

'అమ్మమ్మ నడిగి తీసుకోపోమ్మా పాప' అంటుండగానే పాప వెళ్ళిపోయింది. పాప వెళ్లిన వైపే చూస్తుంది సుగుణ.

సుగుణ ఎవరీపాప నన్ను సస్పెన్సులో చంపక చిరాకుగా అన్నాడు.

'ఆ నాపాప, నాపాప' మెల్లిగా అంది సుగుణ.

'సుగుణ' అంటూ బిగ్గరగా అరిచాడు రమేష్. ఆ అరుపును రాఘవమ్మగారు విందేమోనని భయమేసింది. కాని ఆ సమయానికి వారు పక్కింటికి వెళ్ళినట్లుందని తొంగి చూసి నిమ్మిత పడింది సుగుణ.

'అవునండీ పాప నాపాప, నాకిదివరలోనే వివాహమయింది. నన్ను మా నాన్న ఆస్తికోసం రెండో పెళ్లికిచ్చారు. పెళ్ళయిసంవత్సరం తిరగకముందే గుండె పోటుతో మరణించారాయన. వారసులమంటూ వారి బంధువులు ఆస్తిని హస్తగతం చేసుకున్నారు. చెదిరిన బొట్టుతో, రేగినజుట్టు ముడితో తెల్లని చీరతో పుట్టింటికి చేరాను.

నా ముఖం చూడలేక అన్నయ్య, నాన్న, అమ్మకుమిలిపోయారు. అమ్మా బ్రతిమలాడి 'పుట్టబోయే పాప కోసం నీవు తినాలని' అన్నం తినిపించేది. భరణానికి దావా వేస్తున్నానంటూ సంతకం పెట్టమంటూ వచ్చాడు అన్నయ్య. 'అన్నయ్యా ఆ రోజు నేను పెళ్ళి కావాలి, ఆస్తి కావాలని ఏడ్వలేదు చదువుకుంటానని ఏడ్చిన నాకు పెళ్ళి చేశారు. ఇప్పుడు వారు పోయారు. అక్రమంగా ఆస్తి హస్తగతం చేసుకున్నారు వారసులు, కాని నాకు ఆనాటికి, ఈనాటికి డబ్బుమీద మోజు లేదన్నయ్యా, నా ఆశలు, ఆశయాలు నేలకూలిపోగా నాకీ ఆస్తి ఎందుకు'అని ఏడ్చాను నీ బిడ్డకోసం తపీమని చెప్పింది వదిన'వద్దు వదినా వాళ్లమీద తగాదాకు పోయి ఆస్తి తీసుకుని పాపను పెంచలేను. కష్టపడి ఎలాగో పెంచుకుంటాను' ఆవేదనతో అన్నాను. దాని నేమి మాట్లాడించబోకండర్రా నాన్న ఉత్తరీయంలో కళ్లు తుడుచుకుంటూ అన్నారు. నాన్న [illegible] నేను చూడలేను, బాధగా మూల్గి

అటు తిరిగి పడుకున్నాను. ఆరోజంతా అదోరకంగా ఉన్న నన్ను అమ్మ హాస్పిటలికి తీసికెళ్ళానంది. నేను 'వద్దమ్మా నేను బ్రతికినా చచ్చినా ఒకటే. నీవేమి హైరాన పడకు' అమ్మ కుడ్లనీరు కుక్కుకుంది మాతృత్వం కోసం 'ఇంతనరకమా భగవాన్, ఎందుకయ్యా స్త్రీ కే ఇన్నిబాధలు' బాధగ అనుకున్నాను. ఆడపిల్ల అని వదిన సంతోషంగా అంది 'అయ్యో ఆడపిల్లేనా' అమ్మ నిట్టూర్పు. ఔను మరి అమ్మ అన్నట్లు, స్త్రీగా పుట్టిన తనేం బాపుకుంది. 18 ఏండ్లకే అన్నీ అయిపోయాయి. వైరాగ్యంలో బతుకుతున్న తనకు మరల 'పాపా! అమ్మో పాపభవిష్యత్తు ఇలా కాకూడదు, పాపకోసం తను బ్రతకాలి, పాపను విజ్ఞానవతిగా, ఆదర్శయువతిగా తీర్చిదిద్దాలి. ప్రేమగా పొత్తిళ్ళలో పాపను చూచి పొంగిపోయింది. పాపకు ఏడాది తిరక్కముందే విధి తనను చూసి వికటాట్టహాసం చేసింది. నా దిగులుతో నాన్న చనిపోయారు. నాన్న చనిపోయాక అన్నయ్య అప్పులు తీర్చగ మిగిలినది అందరం తింటానికి, బట్టలకు చాలీ, చాలకుండ జరుగుతుంది. చీటికిమాటికి అత్తగారినుండి భరణం తెచ్చుకోలేదని అనటం మొదలెట్టారు అన్నా, వదినెలు. వారి అంతరంగం గ్రహించి నేను ఫోర్తుఫారం చదువుతో ఆపివేసిన నేను మెట్రిక్ పరీక్షకట్టి ఫాసయ్యాను. స్నేహితురాలి సహాయంతో చిన్న కంపెనిలో 90 రూపాయల జీతంలో గుమాస్తాగా పనిచేస్తూ టైపూ, షార్టుహాండు పాసయ్యాను. ఆ స్నేహితురాలే తన భర్తతో చెప్పి మీ ఆఫీసులో టైపిస్టుగా వేయించారు. వారి సహాయంలో పాపను, అమ్మను తీసుకొచ్చుకొని, పాపకోసమే కాలం గడుపుతున్నాను. మీరు నన్ను ప్రేమించానన్నప్పుడు మీతో ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తోచలేదు. జీవితంలో మొదటిసారిగా నన్ను ప్రేమించానన్నప్పుడు నేనెంతో పొంగిపోయాను. కాని పాపజీవితం బంగారు పంటకావాలనుకున్న కాలంకోసం 25 సంవత్సరాలు నిండని నేను నా ఆశలు, ఆశయాలు అన్నీ పాపకోసం చంపుకుంటున్నాను' అని చెప్పటం ఆపి రమేష్ వంక చూసింది.

రమేష్ ముఖం వెలవెలబోయింది. 'వస్తాను సుగుణ' అంటూ బయటికి నడిచాడు. చాలారోజుల తర్వాత రమేష్ నుండి వచ్చిన లెటరు చూసి నిర్లిప్తంగా నవ్వుకుంది సుగుణ. కాదు తన విధి, తనని మరోసారి హెచ్చరించింది.

''సుగుణా!

నీ కథ అంతా విన్నతర్వాత కూడా నీమీద కొంచెం కూడా ప్రేమ తగ్గలేదు. నిన్ను పెళ్ళి చేసుకోనేందుకు నాకేమి అభ్యంతరంలేదు, కాని మావాళ్ళు రెండోపెళ్ళి అందులో పిల్ల ఉన్న అమ్మాయిని చేసుకోనేందుకు ససేమిరా! ఒప్పుకోవటంలేదు. వారిని ఎదిరించలేకపోవుచున్నాను. 'పాప! ఎవరీపాప' అని అడిగితే నా పాప అని చెప్పే సంస్కారం నాకు ఇంకా రాలేదు.'నాపాపఅని నీవు చెప్పకుండ వుండలేవు' సంఘం నన్ను చూసి అనుకునే మాటలు నన్ను వెక్కిరిస్తాయి. అది నేను భరించలేను. నాబాధ చూసి నీవు సహించలేవు. కాని నిన్ను మరచి జీవితంలో వివాహమనేది మాత్రం కల్ల. నిన్ను మరచి వివాహం చేసుకోలేను. సంఘాన్నెదిరించి నిన్ను వివాహం చేసుకోలేను.

ఎప్పటికి నిన్ను మరువలేని, రమేష్.



శ్రీ కె. ఎస్. ఆర్. పిక్చర్స్ వారి 'బంగారు మనసులు'లో శ్రీమతి జమున,

---

ముఖచిత్రం: పద్మశ్రీవారి 'కొడుకు కోడలు' చిత్రంలో నాగేశ్వరరావు, వాణిశ్రీ